## సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు,పార్టీ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి

# కామ్రేడ్ కోవై ఈశ్వరన్‌కు జోహార్లు



**నగ్జల్బరీ** కామ్రేడ్‌గా ప్రాచుర్యం పొందిన కామ్రేడ్ కోవై ఈశ్వరన్ (80 సం॥లు) చెన్నైలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో 1-7-17 రాత్రి 7 గం॥ల సమయంలో హఠాన్మరణం చెందారు. సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కమిటీ సభ్యులుగా, పార్టీ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కామ్రేడ్ ఈశ్వరన్‌కు సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కమిటి విప్లవ జోహార్లర్పిస్తోంది.

గత ఆరు దశాబ్దాలుగా కమ్యూనిస్టు ఉద్యమంతో పెనవేసుకున్న ఆయన రాజకీయ జీవితం తొలుత సిపిఐలో ప్రారంభమైంది. ఆ తర్వాత సిపిఎంలోనూ కొనసాగారు. ఆ కాలంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి వార్తాపత్రిక 'థీ కథిర్' వ్యవస్థాపకులలో ఒకరుగా వున్నారు.

నగ్జల్బరీ తిరుగుబాటు తర్వాత ఆయన సిపిఐ(ఎం)ను వీడి, చారుమజుందార్ ప్రధాన కార్యదర్శిగా వున్న నాటి సిపిఐ(ఎం-ఎల్)లో, పూర్వ సిపిఐ(ఎం-ఎల్) పీపుల్స్‌వార్‌లో భాగస్వామిగా వున్నారు. ఆ కాలంలో సంచలన సాంస్కృతిక ఉద్యమమైన 'విప్లవ సాంస్కృతికోద్యమం'గా పిలవబడేదానిలో ఆయన పాలుపంచుకున్నారు. అలాగే తమిళభాషలో 'సెంథరాజై' (అరుణతార) అనే పత్రిక 2001లో ఈయన సంపాదకత్వంలోనే వెలువడింది.

తదనంతర కాలంలో కా॥ ఈశ్వరన్ ఆ రాజకీయాలతో విబేధించి 2010 నుండి కా॥ విశ్వం నాయకత్వంలోని సిపిఐ(ఎం-ఎల్)లో కేంద్రకమిటి సభ్యులుగా కృషిచేస్తూ వచ్చారు.

1970లలో ఓ తమిళ మార్క్సిస్టు పత్రికైన 'మానిథాన్' (మానవత)కు కూడా ఆయన సంపాదకత్వం వహించారు. ఆయన పలు రచనలు చేయటంతోపాటు, విఖ్యాతిగాంచిన తరిమెల నాగిరెడ్డి కోర్టు ప్రకటన 'తాకట్టులో భారతదేశం' అనే గ్రంధాన్ని ఇంగ్లీషు నుండి తమిళంలోకి అనువాదం చేశారు.

1970ల కాలంలో ఆయన పౌరహక్కుల ఉద్యమ పరిధిలో పనిచేస్తూ వచ్చారు. 1965లో హిందీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నందుకుగాను ఆయన జైలుశిక్ష అనుభవించటంతోపాటు తన ప్రభుత్వోద్యోగాన్ని కోల్పోయారు. ఆయన అప్పటినుండి మార్క్సిస్టు, లెనినిస్టు ఉద్యమంలో నిమగ్నమై పనిచేస్తూ వచ్చారు. ఆయన ఓ గొప్ప వక్త. యువకులనేకమంది ఆయన ఉపన్యాసాలతో ఉత్తేజితులయ్యారు. తరాల అనంతరం లేకుండా అందరితో కలిసిపోగల స్వభావం ఆయనది.

సిపిఐ(ఎం-ఎల్) తమిళనాడు రాష్ట్రకార్యదర్శిగా ఆయన నేతృత్వంలో పది జిల్లాలలో పార్టీ కమిటీలను ఏర్పరచుకొని కార్యక్రమాలను కొనసాగిస్తున్న ఈ కీలక సమయంలో కా॥ కోవై ఈశ్వరన్ మరణించటం పార్టీకి, ప్రత్యేకించి తమిళనాడు పార్టీ శాఖకు తీవ్రమైన లోటు.

కా॥ కోవై ఈశ్వరన్ మృతిపట్ల సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కమిటి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేస్తోంది. కా॥ కోవై ఈశ్వరన్‌కు విప్లవ జోహార్లర్పిస్తోంది.

కేంద్రకమిటి

**5-7-17** **సిపిఐ(ఎం-ఎల్)**

**oooo**